సాక్షి హనుమకొండ

బుధవారం | 24 | జూలై | 2024



ఎంఈఓలు కరువు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన రెగ్యులర్ ఎంఈఓలు లేరు.

- IIలో▸



26 కేజీల గంజాయి పట్టివేత

వరంగల్ శివనగర్ ఆటోస్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి 26 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

- IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27⁰/24⁰

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సలహాలు, సూచనలు స్వీకరించేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. ఈనెల 24న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమకొండ డిపో నుంచి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. జమ్మికుంట, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, హనుమకొండ, కాజీపేట మండలాలకు చెందిన ప్రయాణికులు 99592 26049 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని, సలహాలు అందించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీఓస్ నాయకులు



హన్మకొండ అర్బన్: జిల్లాలో ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించారని హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అధ్వర్యంలో నాయకులు మంగళవారం కలెక్టర్ పి.ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలందించి శాలువాతో సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తాను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి పనికెల రాజేశ్, కేంద్ర సంఘ నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేశ్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు సురేశ్, రాజేశ్ ఖన్నా, రాజీవ్, అనూప్, ప్రణయ్, శ్రీనివాస్, వెంకన్న, అజీమ్, రఫీ, అశోక్, సుధాకర్, మహబూబ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

హన్మకొండ: వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని టీజీఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. హనుమకొండ సర్కిల్ పరిధి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లలో ఓల్టేజీల్లో హెచ్చుతగ్గుల్లేకుండా ఉండేందుకు 1 ఎంవీఏఆర్, 2 ఎంవీఏఆర్ కెపాసిటర్లు, 64 కెపాసిటర్ బ్యాంకులు, 11 కేవీ లైన్లలో 600 కేవీఆర్ కెపాసిటర్ బ్యాంకులు 34 అమర్చినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మరికొన్ని కెపాసిటర్ బ్యాంకులు అమర్చనున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక వినియోగదారులను కెపాసిటర్లు పెట్టుకోవడాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

రేపటినుంచి సురభి నాటక ప్రదర్శనలు

హన్మకొండ కల్చరల్ : సురభి 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో హనుమకొండ కలెక్టర్, వరంగల్ మహానగర పురపాలక సంఘం సహకారంతో భానోదయ నాట్యమండలి వారి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సురభి నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నాట్యమండలి అధ్యక్షుడు ఆర్.నాగబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఈ నెల 25 నుంచి 31 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు ఈ ప్రదర్శనలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మాయాబజార్, భక్తప్రహ్లాద, లవకుశ, శ్రీకృష్ణలీలలు, జైపాతాళభైరవి, బ్రహ్మంగారి చరిత్ర, రావణబ్రహ్మ నాటక ప్రదర్శనలుంటాయని వివరించారు. కళాకారులు, కళాభిమానులు అధికసంఖ్యలో పాల్గొని ప్రదర్శనలను తిలకించాలని కోరారు.

అదనపు కలెక్టర్‌కు వీడ్కోలు



హన్మకొండ అర్బన్ : హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు బదిలీపై వెళ్తున్న రాధికాగుప్తాకు జిల్లా అధికారుల సంఘం అధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అప్పగించిన పనిని ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిర్వహించగల అధికారి రాధికాగుప్తా అన్నారు. రాధికను అధికారులు, టీఎన్జీఓస్ నాయకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ గణేష్, ఆర్‌డీఓ వెంకటేశ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టీఎన్జీఓస్ నాయకులు రాజేందర్, జిల్లా అధికా రుల సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి పాల్గొన్నారు.

ఓరుగల్లుకు.. ఒనగూరలేదు!

ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనమివ్వని కేంద్రబడ్జెట్



సాక్షి, వరంగల్:

పార్లమెంట్ ఎన్నికల వేళ కేంద్రం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎదురైన నిరాశే 2024 బడ్జెట్‌లోనూ కనిపించింది. ములుగు జిల్లాలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయ హోదా, ప్రధానమంత్రి (పీఎం) మిత్ర కింద ఎంపికైన గీసుకొండ, సంగెం మండలాల పరిధి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధుల కేటాయింపు ఊసే లేదు. అలాగే ఉడాన్ పథకం కింద ఎంపికైన మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి నిధుల కేటాయింపుపై స్పష్టత లేకపోవడం నిరాశను మిగిల్చింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, స్మార్ట్ సిటీ, హృదయ్ ప్రస్తావన ఎక్కడా కనపడలేదు. గ్రేటర్ వరంగల్‌కు 2016 మే నాలుగో వారంలో సప్లిమెంటరీ పోటీల్లో స్మార్ట్ సిటీలో చోటు దక్కినా, రూ.రెండు వేల కోట్లకుపైగా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలున్నా ఆమేరకు నిధులు కేటాయింపు అంశం కూడా చర్చకు రాలేదు. కాంగ్రెస్ ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్ కోరిన కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా అంశమూ ఎక్కడా వినిపించలేదు. అదే సమయంలో వ్యవసాయ సాగుకు సహకారం, రూఫ్ టాప్ సోలార్‌కు ప్రోత్సాహం, ముద్ర రుణం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడం, మొబైల్ ఫోన్ల ధరల తగ్గింపు, బంగారం, వెండి ధరల తగ్గింపు దిశగా కేటాయింపులు ఊరటనిచ్చే అంశాలుగా చెప్పొచ్చు.

- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు లేని నిధుల ఊసు
- సమ్మక్క-సారలమ్మ జాతరకు రాని జాతీయ హోదా
- ఈసారీ మామునూరు ఎయిర్‌పోర్టుపై లేని స్పష్టత
- వ్యవసాయ బడ్జెట్‌తో రైతులకు కాస్త మేలు
- పీఎం ఆవాస్ యోజన 2.0తోనూ ఎంతో ప్రయోజనం

మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులకు ఊరట



కేంద్ర బడ్జెట్ మధ్య తరగతి ప్రజలకు, ఉద్యోగులకు కొంత ఊరటగా ఉంది. కొత్త పన్ను విధానంలో టాక్స్ స్లాబ్‌ని మార్పులు చేయడం ద్వారా ఉద్యోగులకు, చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు ప్రయోజనం చేకూరుతుంది. ఆదాయ పన్ను నోటీసులు గతంలో పదేళ్ల వారికి ఇచ్చేవారు. ఇప్పుడు ఆ వ్యవధిని ఐదేళ్లకు తగ్గించడం వల్ల ఆదాయపన్ను శాఖ నుంచి వేధింపులు తగ్గుతాయి. వడ్డీపై విద్యా రుణాలు ఇవ్వడం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ముద్ర రుణాల పరిమితి రూ.10 నుంచి రూ.20 లక్షలకు పెంచడం చిరు, మధ్య తరగతి వ్యాపారులకు మేలు. మహిళలకు ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ తగ్గింపు ద్వారా వారికి గుర్తింపునిచ్చారు.

- తిప్పర్తి రాఘవరెడ్డి, చార్టెర్డ్ అకౌంటెంట్, హనుమకొండ

నిరాశ పర్చిన బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌లో వికసిత్ భారత్‌లో పేర్కొన్న విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యతనివ్వలేదు. రూ.48లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి 2.59శాతం మాత్రమే నిధులు కేటాయించింది. ఈ నిధులు విద్యాభివృద్ధికి దోహదం చేయవు. కనీసం 10శాతం కేటాయించాలని, జీడీపీలో ఆరుశాతం కేటాయించాలని 1964లో కొఠారి కమిషన్, 1980లో జాతీయ విద్యావిధానం కూడా ప్రతిపాదించింది. వైద్యరంగానికి కూడా బడ్జెట్‌లో 1.85శాతమే కేటాయించారు. ఉచిత విద్య, వైద్యం అటకెక్కినట్లే. వికసిత్ భారత్ అన్నది ఆర్భాట ప్రచారమేనని భావించాల్సి వస్తుంది.

- కదారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

'ఎన్‌పీఎస్ వాత్సల్య'తో ఎంతో మేలు...



పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఇప్పటినుంచే పొదుపు చేసేలా కొత్త పింఛన్ విధానంలో మార్పులు తీసుకురావడం హర్షణీయం. ఈ పెన్షన్ పథకంలో మైనర్లను చేర్చేలా 'ఎన్‌పీఎస్ వాత్సల్య'ను ప్రారంభించనుంది. ఈ పథకంతో మైనర్ల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పిల్లల పేర్ల మీద పెట్టుబడులు పెట్టొచ్చు. వారు మేజర్ అయిన తర్వాత ఖాతా ఆటోమేటిక్‌గా సాధారణ ఎన్‌పీఎస్ అకౌంట్‌గా మారుతుంది.

-జె.శ్రీనివాస్, వరంగల్

'ముద్ర' ద్వారా ఆర్థిక మద్దతు

ముద్ర యోజన కింద ఇచ్చే రుణాలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు అంశం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చిన్న వ్యాపారులకు ఆర్థిక మద్దతు మరింత లభించినట్లయ్యింది. ముఖ్యంగా వ్యవసాయేతర రంగాల్లో ఉండే చిన్న తరహా సంస్థలు, వ్యక్తులకు లోన్లు అందిస్తోంది. ఒక్క గ్రేటర్ వరంగల్‌లోనే 42 వేల మంది వరకు, ఉమ్మడి జిల్లాలోని మిగతా మున్సిపాలిటీల పరిధిలో 60 వేల మంది వరకు ముద్ర పథకం కింద నమోదైన చిరు, వీధి వ్యాపారులు ఉంటారని అంచనా.

- ఉద్యోగార్థుల కోసం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను కేంద్రం ప్రకటించింది. టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తామంది. మరోవైపు మహిళలు, బాలికల కోసం రూ. 3 లక్షల కోట్లతో పథకాల్ని కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించింది. ఇందులో భాగంగా విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు కేటాయించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువత, మహిళలు, బాలికలకు ఈ పథకాలు ఉపయోగపడనున్నాయి.
- కేంద్రం ఆరోగ్యరంగానికి ఇచ్చిన ప్రాధాన్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులకు కూడా మేలు జరగనుంది. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా వైద్యసేవలు పొందుతున్నారు. జాతీయ హెల్త్ మిషన్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, నేషనల్ టెలీ మెంటల్ హెల్త్, నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్‌కు భారీగా నిధులు ఇచ్చారు. దీనిద్వారా ఆరోగ్య రంగానికి పెద్ద పీట వేసినట్లయ్యింది.

వీటితో ప్రయోజనమే..

వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించిన కేంద్రం.. వ్యవసాయ పరిశోధనలకు పెద్ద పీట వేస్తామని ప్రకటించింది. కొత్త వంగడాల విడుదలకు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వారి ఉత్పత్తులకు బ్రాండింగ్, సర్టిఫికేషన్ ఇస్తామంది. ఉమ్మడి జిల్లాలో మామునూరు, మల్యాలలో కృషి విజ్ఞానకేంద్రాలున్నాయి. అదేవిధంగా వరంగల్‌లో వ్యవసాయ విస్తరణ పరిశోధన స్థానం ఉంది. ఇక్కడ కొత్త వంగడాల రూపకల్పన, తెగుళ్లపై పరిశోధనలు జరుగుతుంటాయి. రైతులకు సాగులో సలహాలు, సూచనలు ఇస్తుంటారు. కేంద్రం నిర్ణయంతో ఈ కేంద్రాలకుమరింత ప్రోత్సాహం లభించనుంది. కూరగాయల సాగుకు భారీక్లస్టర్లు, నూనె గింజల్లో స్వయం సమృద్ధి తీసుకొస్తామని ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో 7,54,320 మంది రైతులు ఉన్నారు. ఇందులో కూరగాయలు సాగు చేసే రైతులు తక్కువే. ఈ సాగును ప్రోత్సహించాలని నిర్ణయించడంతో రైతులు అటువైపు మొగ్గుచూపే అవకాశం ఉంది.

- ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకానికి ఐదేళ్లకు రూ.2.2 లక్షల కోట్లు ప్రకటించింది. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడితో కోటి మంది పట్టణ పేద, మధ్యతరగతి కుటుంబాల గృహ అవసరాల్ని తీర్చేందుకు ఆర్థిక సాయం, వడ్డీ రాయితీలు కల్పిస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. ఇది గ్రేటర్ వరంగల్‌తోపాటు నర్సంపేట, వర్ధన్నపేట, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, డోర్నకల్ తదితర పట్టణాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు కాస్త ఆశాజనకంగా కనిపిస్తోంది.

ఫలించని రైల్వే కార్మికుల ఆశలు



కాజీపేట రూరల్: వార్షిక బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా రైల్వే ప్రాజెక్టుల ఊసెత్తకపోవడంతో అటు జిల్లా ప్రజలు, ఇటు రైల్వే కార్మికులు నిరాశ చెందారు. రైల్వే కార్మికులు ఎంతగానో ఎదురుచూస్తున్న 8వ వేతన సంఘం అమలు ఏర్పాటు, న్యూ పెన్షన్ స్కీం వద్దని, పాత పెన్షన్ స్కీం అమలు చేయాలన్న డిమాండ్‌పై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైల్వే కార్మికులు నిరాశ చెందారు. ఇన్‌కంటాక్స్ స్లాబ్ నామమాత్రంగా మార్చడంతో బడ్జెట్ కొంత ఊరట కల్పించింది. ముఖ్యంగా నిర్మాణంలో కాజీపేట రైల్వే వ్యాగన్ షెడ్, అదేవిధంగా కాజీపేట-విజయవాడ మూడో రైల్వేలైన్ నిర్మాణం, జిల్లా మీదుగా వెళ్లే నాలుగో రైల్వే నిర్మాణానికి నిధుల ఊసు లేదు. కాగా, రైల్వే పింక్‌బుక్ ఇంకా విడుదల చేయలేదు. ఈ బుక్ బయటికి వస్తేనే జిల్లా రైల్వే ప్రాజెక్టుల వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది.

ఇది మిశ్రమ బడ్జెట్



నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ మిశ్రమమైనది. సామాన్య ప్రజలకు, రైతులకు, విద్య, వైద్య రంగాలకు, మౌలిక వసతుల కల్పనకు, రోడ్లు, రైలు, విమానాశ్రయములు, జల రవాణా, పోర్టుల అభివృద్ధి, మహిళా అభ్యున్నతి, లక్ష్యంగా 2045 వికసిత భారత్ సాధన దిశలో కేటాయింపులు చేయడం హర్షణీయం. కానీ, రాష్ట్రాలను సమానంగా చూడకుండా బిహార్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బెంగాల్ ఈశాన్య ప్రాంతాలకు అధిక కేటాయింపులు చేసి తెలంగాణకు మొండిచేయి చూపడం అత్యంత బాధాకరం.

- త్రిపురనేని గోపిచంద్, ,చార్టెర్డ్ అకౌంటెంట్

రైతు బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులకు చాన్స్

- గతంలో దరఖాస్తు చేసుకోని వారికి అవకాశం
- వచ్చే నెల 5వ తేదీ చివరి గడువు
- జిల్లాలో బీమా కలిగిన రైతులు 1,37,777

హన్మకొండ: సామాజిక భద్రతలో భాగంగా 2018 ఆగస్టులో ప్రభుత్వం రైతులకు బీమా పథకం ప్రారంభించింది. భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్ ఉన్న రైతులందరికీ బీమా వర్తింపజేశారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులతో పాటు గతంలో దరఖాస్తు చేసుకోలేని రైతులకు రైతు బీమా వర్తింపజేయాలని నిర్ణయించారు. జూన్ 28 వరకు పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీలోపు వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయాధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు రైతు పట్టాదారు పాస్‌బుక్ లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకంతో కూడిన డీఎస్ పత్రం, ఆధార్, నామినీ ఆధార్ పత్రాలు, ఏఈఓ సమక్షంలో సంతకం చేసి ఇవ్వాలి. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమాకు అర్హులు. అదే విధంగా గతంలో రైతు బీమా చేయించుకున్న రైతులు మార్పులు చేర్పులుంటే.. ఈనెల 30వ తేదీలోపు సవరణ చేసుకోవాలి. నామినీ చనిపోతే మార్పు చేసుకోవడానికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది..

రైతు బీమాకు సంబంధించిన ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఎల్ఐసీ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. పథకం ఆరంభంలో ఎల్ఐసీకి ఒక్కో రైతు పేరిట ప్రభుత్వం రూ.2,271 ప్రీమియం చెల్లించగా.. గతేడాది రూ.3,600 చెల్లించింది. రైతు ఏ కారణంచేత మరణించినా.. బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు అందుతాయి. హనుమకొండలో ఇప్పటి వరకు 1,37,777 మంది రైతులకు ప్రభుత్వం బీమా కవరేజ్ చేయించింది. ఇందులో 2023 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 447 మంది మృతి చెందగా.. 402 మందికి రూ.20.10 కోట్లు క్లయిమ్స్ రూపేణా బీమా సొమ్ము చెల్లించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఈ సాయం ఎంతో భరోసానిచ్చింది. కొత్తగా పట్టాదారులైన రైతులకు జరుగుతున్న నష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం వారికి కూడా రైతు బీమా వర్తింపజేస్తోంది.

రైతులు వినియోగించుకోవాలి..



పట్టాదారు పాస్‌బుక్ కలిగి ఉన్న వాళ్లు రైతు బీమా చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. జూన్ 28వ తేదీ వరకు పట్టాదారు పాస్‌బుక్ పొందిన వారు సైతం బీమాకు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన రైతులు వ్యవసాయ విస్తరణాధికారులను (ఏఈఓ) కలిసి దరఖాస్తు సమర్పించాలి. ఈఅవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి.

- దామోదర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ, సహాయ సంచాలకుడు

వన మహోత్సవాన్ని పూర్తి చేయండి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

హన్మకొండ అర్బన్: జిల్లాలో ఆగస్టు 15 నాటికి వన మహోత్సవాన్ని పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పురపాలక శాఖ, హార్టికల్చర్, నీటిపారుదల, విద్యా, రహదారులు భవనాల, ఇతర శాఖలకు నిర్దేశించిన టార్గెట్‌ను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ తరఫున రహదారుల పక్కన, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఈజీఎస్ పథకం ద్వారా, విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌లు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

క్షేత్రస్థాయిలో పరిశీలన

నిలిపేసిన పింఛన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆసరా పింఛన్ల పంపిణీ, నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,04,400 లబ్ధిదారులకు పింఛన్లు పోస్టాఫీస్, ఇతర బ్యాంకుల ద్వారా పంపిణీ జరుగుతున్నట్లు తెలిపారు. నిలిచిన పింఛన్లను పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు.

మహిళా సాధికారతకు 'ఇందిరా మహిళా శక్తి'

మహిళలను సాధికారత దిశగా నడిపించేందుకు 'ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం' తోడ్పడుతుందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు సాధికారత, ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు 14 అంశాల్లో యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంపై ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్డీఏ పీడీ నాగ పద్మజ, ఆర్అండ్‌బీ ఈఈ సురేశ్, అదనపు డీఆర్డీఓ సుధీర్, డీపీఎం శ్రీకాంత్, ప్రకాశ్, అనిల్, మెప్మా సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా మురళి

ఎంజీఎం: ఎంజీఎం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సీహెచ్ మురళిని ప్రభుత్వం నియమించింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఎంజీఎం సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ ములుగు ప్రభుత్వ కళాశాలకు బదిలీ కావడంతో మంగళవారం సాయంత్రం చంద్రశేఖర్ నుంచి మురళి బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా మురళిని ఆర్ఎంఓలు మురళి, శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

ఉద్యాన ప్రణాళిక ఖరారు



హన్మకొండ: ఉద్యాన శాఖ హనుమకొండ జిల్లా సాగు ప్రణాళిక ఖరారైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సమీకృత అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, నేషనల్ మిషన్ ఆజ్ ఎడిబుల్ ఆయిల్స్ జాతీయ వెదురు మిషన్ పథకాల ద్వారా అమలు చేసే లక్ష్యాలను ఉద్యాన శాఖ ఖరారు చేసింది. అరటి, బొప్పాయి పంటలకు రెండేళ్ల పాటు, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో పంటలకు మూడేళ్ల రాయితీ అందిస్తారు. రూ.125.38 లక్షలతో 338 ఎకరాల్లో సూక్ష్మ సేద్యం, రూ.6.55 లక్షలతో 86 ఎకరాల్లో తుంపర్ల సేద్యాన్ని అమలు చేయనున్నారు. రూ.7.50 లక్షలతో 15 ఎకరాల్లో శాశ్వత పందిళ్లు ఏర్పాటు చేయడానికి యూనిట్‌కు రూ.50 వేల చొప్పున రాయితీ అందిస్తారు. నేషనల్ మిషన్ యాజ్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం ద్వారా 3 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు పెంచుతారు. ఒక మొక్కకు రూ.193, నాలుగేళ్ల పాటు తోటల సంరక్షణకు ఎకరాకు రూ.2,100 చొప్పున, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంటలకు నాలుగేళ్ల పాటు ఎకరానికి రూ.2,100 చొప్పున రాయితీని రైతులకు చెల్లిస్తారు. జాతీయ వెదురు మిషన్ ద్వారా జిల్లాలో వెదురు తోటల పెంపకానికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తోంది. ఎకరాకు రూ.10 వేల రాయితీ అందిస్తోంది. జిల్లాలో 25 ఎకరాల్లో వెదురు తోటలు పెంచాలని, పొలం సరిహద్దులపై 2,910 మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. పొలం సరిహద్దులపై మొక్కల పెంపకానికి మొక్కకు రూ.60 రాయితీ చెల్లిస్తారు. ఆసక్తి కలిగిన రైతులు ఉద్యాన అధికారులు బి.మధులిక (89777 14069), బి.మానస (89777 14068)ను సంప్రదించాలని జిల్లా ఉద్యాన అధికారి ఆర్.శ్రీనివాస్‌రావు తెలిపారు.

జిల్లాలో అమలు చేయనున్న లక్ష్యాలు

పంట	ఎకరాకు రాయితీ (రూ.లలో)	ఎకరాలు/నిధులు యూనిట్లు	(రూ.లక్షల్లో)
అరటి	12,300	125.00	15.37
బొప్పాయి	9,000	25.00	2.25
మామిడి	3,900	37.50	1.48
జామ	7,040	12.50	0.88
డ్రాగన్ ఫ్రూట్	38,400	12.50	4.80
అవకాడో	7,200	2.50	0.18
పూల తోటలు	6,400	100.00	6.40
మల్చింగ్	6,400	437,50	28.00
ప్యాక్ హౌస్	2,00,000	ఒకటి	2.00
తేనెటీగలు	800	80	0.64
బీ హైవ్స్	800	80	0.64

బ్యాంకర్ల తప్పిదం.. వర్తించని రుణమాఫీ

- రుణాల చెల్లింపుల్లో ఇద్దరికి ఒకే ఆధార్
- తనకు అన్యాయం జరిగిందని మహిళా రైతు ఆవేదన

శాయంపేట: పంట రుణాల చెల్లింపుల్లో బ్యాంకర్లు ఇద్దరు రైతులకు ఒకే ఆధార్ నంబర్ నమోదు చేయడంతో రూ.లక్ష రుణమాఫీ పథకం తనకు వర్తించకుండా పోయిందని మహిళా రైతు గజ్జి ఐలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన గజ్జి ఐలమ్మ శాయంపేట భారతీయ స్టేట్ బ్యాంకులో క్రాప్ లోన్ రూ.78,711 తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల లక్ష రుణమాఫీని ప్రకటించి అమలు చేయడంతో తాను తీసుకున్న పంట రుణం మాఫీ అవుతుందని సంబరపడింది. తీరా రుణమాఫీ జాబితా విడుదలయ్యాక అందులో తన పేరు లేకపోవడంతో కంగారు పడింది. ఆమె వ్యవసాయ అధికారులను సంప్రదించగా.. ఆమె తీసుకున్న పంట రుణం వివరాలను అందించడంతో ఆమె ఆధార్ నంబర్‌కు అదే నంబర్‌తో కొడగాని రాజేశ్వర్ రావు ఆత్మకూరు డీసీసీబీ బ్యాంకులో 1,57,236 రుణం తీసుకున్నట్లు మొత్తంగా క్రాప్‌లోన్‌ను 2,35,947 నమోదు అయ్యింది. దీంతో తనకు రుణమాఫీ వర్తించలేదని అధికారులతో ఆమె తెలిపారు. బ్యాంకర్ల తప్పిందంతో తన ఆధార్‌కార్డు నంబర్‌పై మరో రైతు రుణం నమోదయ్యిందని ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీకి అర్హత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే విషయమై శాయంపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో ఏఓ గంగాజమునకు దరఖాస్తు చేసినట్లు తెలిపింది. ఇదే విషయమై ఏఓ గంగాజమునను వివరణ కోరగా.. రుణమాఫీలో జరిగిన పొరపాట్లపై రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బుధవారం జరిగే బ్యాంకర్ల సమావేశంలో ఈ విషయాలను వెల్లడించి సమస్యను పరిష్కరిస్తామని ఏఓ తెలిపారు.



దరఖాస్తును చూపిస్తున్న ఐలమ్మ

క్లుప్తంగా

బల్దియా ఎస్‌ఈగా రాజయ్య

వరంగల్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల్లో పాతుకుపోయిన అధికారుల బదిలీల పరంపర కొనసాగుతోంది. వరంగల్ బల్దియా ఎస్ఈ కృష్ణారావు గ్రేటర్ హైదరాబాద్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఇక్కడే కొనసాగుతున్న ఈఈ కె.రాజయ్యకు ఫుల్ అడిషనల్ చార్జ్ ఎస్‌ఈగా బాధ్యతలు అప్పగిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బల్దియాలో ఏళ్ల తరబడి పాతుకపోయిన ఈఈలు, డీఈలు, ఏఈలకు బదిలీలు జరగనున్నాయి.

కలెక్టరేట్‌లో పారిశుద్ధ్య పనులు



కాశిబుగ్గ సెంటర్: కలెక్టరేట్‌లో ఎట్టకేలకు మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'కలెక్టరేట్‌లో కంపు కంపు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏఓ శ్రీకాంత్ సిబ్బందిని ఆదేశించి డోజర్‌తో కలెక్టరేట్ ఆవరణలో ఉన్న చెత్త, బురద నీటిగుంతలను చదును చేసి శుభ్రం చేయించారు. అదేవిధంగా కలెక్టరేట్ వెనుకభాగంలో ఉన్న పాత సామాను దొంగిలించిన వ్యక్తి గురించి ఆరా తీస్తున్నారు.

వెంచర్ల అభివృద్ధి వేగంగా పూర్తి చేయండి

'కుడా' వీసీ అశ్విని తానాజీ వాకడే

నయీంనగర్: 'కుడా' వెంచర్ల అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని 'కుడా' వైస్ చైర్మన్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం 'కుడా' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మా సిటీ, యునీ సిటీ' వెంచర్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వైస్ చైర్మన్ పరిశీలించి వేగంగా పూర్తి చేయడానికి అధికారులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా 'కుడా' వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. వెంచర్లలో ప్లాట్ల కేటాయింపులు జరిగినందున అందులో ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించాల్సి ఉందన్నారు. మా సిటీ వెంచర్‌లో 330 ఆజంజాహీ మిల్లు కార్మికులకు ప్లాట్లు కేటాయించినందున వేగంగా పనులు పూర్తి చేయాలని వైస్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 'కుడా' సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలు కరువు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కరే రెగ్యులర్ విద్యాధికారి

- ఎఫ్ఏసీ ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా పీజీ హెచ్‌ఎంలు
- ఒక్కొక్కరికి రెండు నుంచి నాలుగైదు మండలాల వరకు బాధ్యతలు
- పాఠశాలల్లో కొరవడిన పర్యవేక్షణ



విద్యారణ్యపురి : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యారంగంలో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యనందిస్తున్నామని పాలకులు చెబుతున్నారు. కానీ ఆచరణలో విద్యా ప్రమాణాలు పెంపుదల అంతంతమాత్రమేననే విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన కీలక అధికారి రెగ్యులర్ ఎంఈఓ లేరు. ఒకే ఒక్క రెగ్యులర్ ఎంఈఓ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా మిగతావారు కూడా కొందరే ఎఫ్ఏసీ ఇన్‌చార్జ్ ఎంఈఓలే ఉన్నారు. అందులో కూడా ప్రతి మండలానికి కూడా ఇన్‌చార్జ్ ఎంఈఓను నియమించడం లేదు. ఫలితంగా ఒక్కో ఎంఈఓ రెండు, మూడు, నాలుగైదు మండలాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండడంతో పర్యవేక్షణ కొరవడింది. మరోవైపు వివిధ జిల్లాల్లోనూ రెగ్యులర్ డీఈఓలను నియమించకపోవడంతో ఏడీలే డీఈఓ ఎఫ్ఏసీతో విధులు నిర్వర్తిస్తున్న పరిస్థితి నెలకొంది.

ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా పీజీహెచ్‌ఎంలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 78మండలాలు ఉండగా అందులో హనుమకొండలోని ఎల్కతుర్తి మండలంలో మాత్రమే ఒక్క రెగ్యులర్ ఎంఈఓ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో వేరే మండలాలకు అదనపు బాధ్యతలు అప్పగించలేదు. మిగతా అన్ని మండలాల్లో కొన్ని మండలాలకే ఇన్‌చార్జ్ ఎంఈఓలు ఉండగా ఒక్కొక్కరికి పలు మండలాలు అప్పగించారు. హనుమకొండ జిల్లాలో 14 మండలాలు ఉంటే అందులో ఒక్కరే రెగ్యులర్ ఎంఈఓ కాగా మరో ముగ్గురు ఇన్‌చార్జ్ ఎంఈఓలు ఒకరికి నాలుగు, మరొకరికి నాలుగు, ఇంకొకరికి ఐదు మండలాల బాధ్యతలు అప్పగించారు.

వరంగల్ జిల్లాలో 13 మండలాలకు నలుగురు ఇన్‌చార్జ్‌లు

జిల్లాలో ఎంఈఓలు ఒకరికి నాలుగు, మరొకరికి మూడు, ఇంకొకరికి రెండు ఉండగా అందులో ఇద్దరు ఇన్‌చార్జ్ ఎంఈఓలు పీజీహెచ్‌ఎంలు కావడంతో కొన్నినెలలు క్రితం నిర్వహించిన బదిలీల్లో ఇద్దరు విజయ్‌కుమార్, సత్యనారాయణ హనుమకొండ జిల్లాకు బదిలీ అయ్యారు. అయినా సంబంధిత అధికారుల మౌఖిక ఆదేశాలతో వారు పీజీహెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తూనే వరంగల్ జిల్లాలోని తమకు కేటాయించిన మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విజయకుమార్ సంగెం, వరంగల్, ఖిలావరంగ్ మండలాలు, సత్యనారాయణ గీసుకొండ, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి మండలాల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

- ములుగు జిల్లాలో 9 మండలాలకు గాను ఆరుగురు ఇన్‌చార్జ్ ఎంఈఓలు ఉండగా అందులో ఇద్దరు హనుమకొండ జిల్లాకు ఒకరు వరంగల్ జిల్లాకు మరొకరు పీజీహెచ్‌ఎంలుగా బదిలీ అయ్యారు. అందులో ఒకరు తాడ్వాయి మండలానికి, మరొకరు మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- జనగామ జిల్లాలో 12 మండలాలు ఉండగా ఇద్దరు ఇన్‌చార్జ్ ఎంఈఓలు ఉంటే వారు కూడా పీజీహెచ్‌ఎంలు కావడంతో కొన్ని నెలల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లాలో అసలే ఇన్‌చార్జ్ ఎంఈఓలు కూడా లేని పరిస్థితి నెలకొని ఉంది. దీంతో ఆ జిల్లాలోని మండలాల్లో ఒక్కో మండలానికి పీజీహెచ్‌ఎంలను మండల నోడల్ అధికారులుగా ఇప్పటికే నియమించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12మండలాలకు ఇద్దరు ఇన్‌చార్జ్ ఎంఈఓలే పనిచేస్తున్నారు.
- మహబూబాద్ జిల్లాలో 18మండలాలకు ముగ్గురే ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

18 ఏళ్లుగా రెగ్యులర్ ఎంఈఓలుగా పదోన్నతుల్లేవు

18 ఏళ్లుగా అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోగాని, ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలోగాని రెగ్యులర్ ఎంఈఓలుగా పదోన్నతు లేవు. ఒకప్పుడు స్కూల్ అసిస్టెంట్‌లకు కూడా ఎంఈఓలుగా పదోన్నతి కల్పించే వారు. ఆ తరువాత పీజీహెచ్‌ఎంలకు ఎంఈఓలుగా పదోన్నతి కల్పించారు. 2005లో పదోన్నతుల కల్పన తరువాత మళ్లీ ఇప్పటి వరకూ రెగ్యులర్ ఎంఈఓలుగా పదోన్నతులు లేవు.

సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించాలి



ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఎంఈఓలుగా పదోన్నతులు కల్పించాలి. లేకపోతే ప్రత్యామ్నాయంగా ఏపీలో ఇచ్చినట్లు ప్రభుత్వ పాఠశాలలకు ఒక ఎంఈఓ, జిల్లా పరిషత్ పాఠశాలలకు మరొక ఎంఈఓను నియమించి పరిష్కారం మార్గం చూపాలి. ఇన్‌చార్జ్ ఎంఈఓలకు నాలుగైదు మండలాలు బాధ్యతలు ఉండి తాము పనిచేసే ఉన్నత పాఠశాలకు, ఇటు ఎంఈఓగా న్యాయం చేయలేకపోతున్నారు.

– పెండెం రాజు, టీయూటీఎఫ్, హనుమకొండ జనరల్ సెక్రటరీ

వరంగల్ డీఈఓ ఆఫీస్ ఏడీ సులోచన బదిలీ



సర్టిఫికెట్ల పరిశీలనకు బారుదీరిన ఉపాధ్యాయులు

కాశిబుగ్గ సెంటర్: వరంగల్ విద్యాశాఖ కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ సులోచన హైదరాబాద్‌లోని మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం రిలీవ్ అయ్యారు. హైదరాబాద్‌లోని సైట్ ఆఫ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ట్రైనింగ్‌లో ఏడీగా పనిచేస్తున్న జ్ఞానేశ్వర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. అదే విధంగా ఏఓ శ్రీధర స్వామి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కె.జ్యోతిని జిల్లాకు బదిలీ చేయగా విధుల్లో చేరారు. సీనియర్ అసిస్టెంట్లు సీహెచ్.శ్రీనివాస్ మహబూబాబాద్ జిల్లాకు, ఉమర్‌కాంత్ ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు.

డీఈఓ కార్యాలయంలో బారులు

జీఓ 317కు సంబంధించిన అప్పీల్స్ కోసం వివిధ కారణాలతో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోని వారు మంగళవారం వరంగల్ డీఈఓ కార్యాలయంలో బారులు తీరారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కూడా ఆఫ్‌లైన్‌లో అప్పీల్ చేసుకోవచ్చునని సోమవారం రాత్రి అధికారులకు ఆదేశాలు వచ్చాయి.ఈ మేరకు డీఈఓ కార్యాలయానికి బాధితులు పోటెత్తారు. అంతకుముందే జిల్లా నుంచి 244 దరఖాస్తులు రాగా.. 317 జీఓ సబ్ కమిటీ ఆదేశాల మేరకు సర్టిఫికెట్లను పరిశీలించారు. మెడికల్, స్పౌజ్, స్థానికత, మ్యూచువల్ ఇతర అంశాలకు సంబంధించిన బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

26 కేజీల ఎండు గంజాయి పట్టివేత

- ఇద్దరి వ్యక్తుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరామ్‌నాయక్

ఖిలా వరంగల్ : వరంగల్ శివనగర్‌లో ఆటో స్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి మిల్స్‌కాలనీ పోలీసులు 26 కేజీల 546 గ్రాముల ఎండు గంజాయి పట్టుకున్నారు. ఈ మేరకు మిల్స్‌కాలనీ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్ వైపు రైల్వేస్టేషన్ ఎదుట ఆటో స్టాండ్ వద్ద మిల్స్‌కాలనీ ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒడిశాలోని గంజాం జిల్లా బేగనిపాడ కోడాల గ్రామానికి చెందిన కేశబ్ సేతీ, ఇదే జిల్లా పంచబుతి గ్రామానికి చెందిన ముత్యుంజయ సాహు రెండు బ్యాగులు పట్టుకుని అనుమానాస్పందంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అదే ప్రాంతానికి చెందిన దీపక్ ప్రధాన్ అనే వ్యక్తి నుంచి కేజీకి రూ.5వేల చొప్పున మొత్తం 26కేజీల 546 గ్రాములు ఎండు గంజాయి కొనుగోలు చేశారు. మహారాష్ట్రలోని పూణెకు చేరవేసేందుకు 22న ఒడిశాలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. ఈక్రమంలో వరంగల్‌కు చేరిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ఎలాగైనా పట్టుబడు తామనే భయపడి ముందుగానే ఆ ఇద్దరు వ్యక్తులు బ్యాగులు పట్టుకుని రైలు దిగి శివనగర్ వైపు ఆటో స్టాండ్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్న మిల్స్‌కాలనీ ఎస్సై సురేశ్‌కు అనుమానాస్పందంగా కనిపించారు. వెంటనే అదుపులోకి తీసుకుని వారి నుంచి 26 కేజీల 546 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌కంట్యాక్స్ ఫైలింగ్ సవరణకు అవకాశం

- ఇన్‌కం ట్యాక్స్ హైదరాబాద్ రేంజ్–3 అడిషనల్ కమిషనర్ సీతారామాంజనేయులు



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను హైదరాబాద్ రేంజ్ -3 అడిషనల్ కమిషనర్ సీతారామాంజనేయులు

హన్మకొండ: తప్పుడు ఇన్‌కంట్యాక్స్ ఫైలింగ్ చేసిన వారికి సవరణ చేసుకునే అవకాశం కల్పించినట్లు ఇన్‌కం ట్యాక్స్ హైదరాబాద్ రేంజ్–3 అడిషనల్ కమిషనర్ ఎస్.సీతారామాంజనేయులు తెలిపారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్లు, డ్రాయింగ్ ఆఫీసర్లు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులకు ఆదాయపు పన్నుపై అవగాహన సదస్సు జరిగింది. ఆదాయపు పన్ను ఫైలింగ్ ఎలా చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఎస్.సీతారామాంజనేయులు మాట్లాడుతూ కొంతమంది చార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర ఆదాయపన్ను ఫైలింగ్ విధానం నేర్చుకుని నగదు రీఫండ్ వచ్చేలా తప్పుడు ఫైలింగ్ చేస్తున్నారని, అలా చేస్తే జరిమానా విధించనున్నట్లు తెలిపారు. తప్పుడు ఫైలింగ్ చేసిన వారికి తిరిగి సవరణ చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి 50 శాతం వడ్డీ, 2023–24 ఆర్థిక సంవత్సరానికి 25 శాతం వడ్డీతో మరోసారి ఫైలింగ్ చేసుకోవచ్చని తెలిపారు. వాస్తవ ఆదాయం చూపించి ఆదాయ పన్ను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతి రెడ్డి, జీఎంలు దేవేందర్, వేణుబాబు, సత్యనారాయణ, ఆదాయ పన్ను అధికారులు మహేందర్ బాబు, అవినాష్, చార్టర్డ్ అకౌంటెంట్ అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమందించండి

- కలెక్టర్ ప్రావీణ్య
- జీఎంహెచ్ తనిఖీ



బాలింత కేస్‌షీట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ చౌరస్తా: ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య వైద్యాధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ప్రతీ వార్డును కలియ తిరుగుతూ.. గర్భిణి, బాలింతలు, వారి బంధువులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యుల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌తో పాటు రోగులకు అందిస్తున్న భోజనం, మందులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఎన్‌సీయూ, ఐసీటీసీ కేంద్రం, హెచ్ఐవీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యశ్రీలో వర్తించే జబ్బులకు సంబంధించిన జాబితాను ఆస్పత్రిలో ప్రదర్శించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కల్గినప్పుడు ఆటోమేటిక్‌గా జనరేటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జీఎంహెచ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఇతర వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- హైదరాబాద్‌లో ఘటన
- మృతులు తోడేళ్లగూడెం, బేరువాడ వాసులు
- ఆయా గ్రామాల్లో విషాదఛాయలు



మనోజ్(ఫైల్)

డోర్నకల్ : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇందులో డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన గొలుసు మనోజ్(23), కేసముద్రం మండలం బేరువాడకు చెందిన రాజు(24) ఉన్నారు. వీరు హైదరాబాద్ మియాపూర్‌లోని ఓ ఫుడ్‌కోర్ట్‌లో పని చేస్తున్నారు. విధులు ముగించుకుని సోమవారం అర్ధరాత్రి బైక్‌పై రూమ్‌కు వస్తుండగా మియాపూర్‌లో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

వారం క్రితమే బుల్లెట్ వాహనం కొనుగోలు..

తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన గొలుసు జమాల్, పద్మకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా జమాల్ పదేళ్ల క్రితమే మృతి చెందడంతో పద్మ కుటుంబాన్ని పోషిస్తోంది. కుమారుడు మనోజ్ హైదరాబాద్‌లో ఓ ఫుడ్ కోర్టులో పని చేస్తున్నాడు. ఆరు రోజుల క్రితం ఖమ్మంలో బుల్లెట్ (వాహనం) కొనుగోలు చేశాడు. సోమవారం ఉదయం గ్రామం నుంచి మియాపూర్ వెళ్లి విధులకు హాజరయ్యాడు. విధులు ముగించుకుని మిత్రుడు రాజుతో కలిసి రూమ్‌కు వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరూ చనిపోయారు. కాగా, చేతికందిన కొడుకు కుటుంబ భారం మోస్తాడనుకున్న తరుణంలో రోడ్డు ప్రమాదంలో మృత్యుఒడికి చేరడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బాధితులకు సాంత్వన చేకూర్చాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

రామన్నపేట: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించి సాంత్వన చేకూర్చాలని సీపీ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం నగరంలోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌ను అధికారులతో కలిసి సీపీ తనిఖీ చేశారు. ముందుగా సీపీకి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గోపి పూలమాల అందజేసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా సీపీ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పోలీస్‌స్టేషన్ ఆవరణలోని పరిసరాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న నేరాల సీ, డీ ఫైల్స్, స్థిరాస్తి చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతుల రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధి రౌడీషీటర్లు, ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అరెస్ట్ చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్తుల సమాచారాన్ని సంబంధిత రాష్ట్రాలకు అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచరించే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని వివరించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో సీపీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్ గోపీ, ఎస్సైలు విఠల్, లచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్వాలిఫైయింగ్ పోటీలు

- మెయిన్ డ్రా పోటీలకు 26 మంది అర్హత



క్వాలిఫైయింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారుడు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్–17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం క్వాలిఫైయింగ్ పోటీలు నిర్వహించారు. హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్‌లో బాలురకు, భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్‌లో బాలికలకు క్వాలిఫైయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 84 మంది బాలురు, 62 మంది బాలికలు పాల్గొనగా 26 మంది మెయిన్ డ్రా పోటీలకు అర్హత సాధించినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పింగిళి రమేశ్‌రెడ్డి తెలిపారు. మెయిన్ పోటీలను నేడు (బుధవారం) ఉదయం 9 గంటలకు సుబేదారిలోని వరంగల్‌క్లబ్‌లో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి నందగోపాల్, విద్యాదర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీభద్రకాళి ఆలయానికి భక్తుడు రూ.లక్ష విరాళం

హన్మకొండ కల్చరల్: నగరంలోని శ్రీభద్రకాళీ దేవస్థానానికి ఓ భక్తుడు రూ.లక్ష విరాళం అందజేశాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన హిరాలాల్ రాజేంద్రప్రసాద్ అగర్వాల్ మంగళవారం శ్రీ భద్రకాళిఅమ్మవారిని దర్శించుకుని ఉచిత ప్రసాద వితరణ కోసం రూ.1,00,116ల విరాళం అందించారు. ఈఓ సదరు దాతను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

మరో 261 మందికి పదోన్నతులు!

- మిగులు టీచర్ పోస్టుల్లో పదోన్నతులు
- ఒక్కపోస్టుకు ఒక్కరికే సీనియారిటీ జాబితా వెల్లడి

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల ఎస్‌జీటీలకు పీఎస్‌హెచ్‌ఎం, స్కూల్‌అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించిన విషయం విధితమే. ఇందులో మిగిలిన ఆయా టీచర్ పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలని విద్యాశాఖ నిర్ణయించింది.ఈ మేరకు వివరాలు పంపాలని విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయ అధికారులు డీఈఓలను ఆదేశించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల జరిగిన పదోన్నతుల అనంతరం మిగులు పోస్టుల జాబితాను ఒక పోస్టుకు ఒకరితో కూడిన సీనియారిటీ జాబితాను వివిధ జిల్లాల్లో డీఈఓలు మంగళవారం వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 261 పోస్టుల్లో త్వరలోనే పదోన్నతులు కల్పించబోతున్నారు. మల్టీజోన్ –1పరిధిలో హనుమకొండ జిల్లాలో 41, వరంగల్ జిల్లాలో 44, ములుగు జిల్లాలో 33, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 34, మహబూబాబాద్ జిల్లాలో 60 మిగులు పోస్టులు ఉన్నాయని గుర్తించారని సమాచారం. ఆయా జిల్లాల డీఈఓలు ఒక పోస్టుకు ఒక్కరినే సీనియారిటీ జాబితాగా వెల్లడించి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారని తెలిసింది. మల్టీజోన్ –2 పరిధిలోని జనగామ జిల్లాలో పదోన్నతులు పోనూ మిగులు పోస్టులు 31 ఉండగా లాంగ్వేజ్ పండిట్ల అప్‌గ్రేడేషన్‌గా మరో 18 పోస్టులకు పదోన్నతులు కల్పిస్తున్నారని సమాచారం. దీంతో ఆ జిల్లాలో 49మందికి పదోన్నతులు కల్పించబోతున్నారు.

వేకెన్సీలు ఏర్పడిందిలా..

ఇటీవల ఎస్‌జీటీలకు పీఎస్‌హెచ్‌ఎం, స్కూల్‌అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించిన సమయంలో కొందరు ఎస్‌జీటీలు రెండు, మూడు పోస్టుల్లోనూ పదోన్నతులు పొందారు. ఎందుకంటే వారు ఎస్‌జీటీ నుంచి అర్హతలు బట్టి డిగ్రీతో బీఈడీ చదివిన వారు. బీఈడీతో తప్పనిసరిగా రెండు మెథడాలజీలు చదివి ఉన్న నేపథ్యంలో స్కూల్‌అసిస్టెంట్లు రెండు సబ్జెక్టుల్లోనూ పదోన్నతికి అర్హత ఉంటుంది. ఒకవేళ వారిలో ఎవరికైనా డీఈడీ కూడా ఉంటే పీఎస్‌హెచ్‌ఎంగా పదోన్నతి పొందేందుకు అర్హత ఉంటుంది. దీంతో ఎస్‌జీటీలు కొందరు వెబ్ ఆప్షన్లు ఇచ్చినప్పుడు పదోన్నతులకు రెండు, మూడు ఆప్షన్లు కూడా ఇచ్చారు. దీంతో కొందరు ఒక్కొక్కరు డబుల్, త్రిబుల్ పదోన్నతులు పొందారు. కానీ ఏదో ఒక పదోన్నతిలో మాత్రమే చేరారు. దీంతో అలా మిగిలిన పోస్టుల తోపాటు మరికొందరు పదోన్నతి లభించగా నాట్‌విల్లింగ్ ఇవ్వడం లేదా జాయిన్ అయ్యాక కూడా పలువురు రిటన్షన్ రావడంతో పోస్టులు మిగిలాయి.

త్వరలో వెబ్‌ఆప్షన్లు ఇచ్చే అవకాశం

మిగులు పోస్టుల్లో పదోన్నతులకు సంబంధించిన ఒక పోస్టుకు ఒకరికి సీనియారిటీ జాబితాను వెల్లడించి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం పదోన్నతులు పొందేవారి వివరాలను విద్యాశాఖ డైరెక్టరేట్‌కు డీఈఓలు ఆన్‌లైన్‌లోనే పంపనున్నారు. ఆ తరువాత విద్యాశాఖ డైరెక్టరేట్ అధికారులు పరిశీలించాక త్వరలోనే పదోన్నతులకు సంబంధించి ఆయా టీచర్లు వెబ్ ఆప్షన్లు ఇచ్చే అవకాశం కల్పించబోతున్నారు.

బొగత జలపాతంలో పడి విద్యార్థి మృతి

- మృతుడిది వరంగల్‌లోని సుందరయ్యనగర్



జస్వంత్(ఫైల్)

వాజేడు/వరంగల్: ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత చూడడానికి వచ్చిన ఓ విద్యార్థి జలపాతంలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మృతి చెందాడు. వరంగల్ జిల్లా ఏనుమాముల మార్కెట్ పరిధిలోని సుందరయ్యనగర్‌కు చెందిన బోనగాని నాగేశ్వరరావు కుమారుడు జస్వంత్(19) వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో తన మిత్రులు సాయికిరణ్, నాగేంద్ర, సుశాంత్, వంశీ, గౌస్‌తో కలిసి బొగత జలపాతం చూడటానికి వచ్చాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతంలో దిగడానికి ప్రయత్నించగా సిబ్బంది అడ్డుకున్నారు. అయినా పట్టించుకోకుండా ముగ్గురు నీటిలోకి దిగారు. ఈ క్రమంలో నీటిలో మునిగిపోతుండగా సమీపంలో ఉన్న వారు ఇద్దరిని సురక్షితంగా బయటకు లాగారు. జస్వంత్ మాత్రం నీటిలో మునిగిపోయాడు. కొలను నీటిలో గాలించగా జస్వంత్ మృతదేహం లభించింది. ఈ విషయంపై జస్వంత్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో తండ్రి నాగేశ్వర్‌రావు ఘటనా స్థలం వద్దకు చేరుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. కాగా, జస్వంత్ మృతితో సుందరయ్య కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బొగత సందర్శన బంద్

వాజేడు: బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బుధవారం నుంచి సందర్శనను నిలిపి వేస్తున్నట్లు ములుగు జిల్లా అటవీ శాఖాధికారులు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. విస్తారంగా వర్షాలు పడుతుండడంతో గుట్టలపై నుంచి జలపాతానికి భారీ స్థాయిలో వరద నీరు వస్తోంది. దీంతో జలపాతం ఉగ్ర రూపం దాల్చి ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండడం, మంగళవారం ఓ విద్యార్థి చనిపోవడంతో జలపాత సందర్శనను నిలిపివేశారు. వరదలు తగ్గిన తరువాత సందర్శనకు అనుమతి ఉంటుందని తెలిపారు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు... 'ఖేలో ఇండియా'కే రూ. 900 కోట్లు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం క్రీడలకు ఇచ్చే వార్షిక బడ్జెట్‌ను స్వల్పంగా పెంచింది. మంగళవారం ప్రకటించిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన రూ.3,396.96 కోట్లతో పోలిస్తే ఇది రూ.45.36 కోట్లు ఎక్కువ. ఎప్పటిలాగే ఇందులో ఎక్కువ మొత్తం దిగువ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దే 'ఖేలో ఇండియా' పథకానికే కేటాయించింది. గత ఏడాదికంటే రూ.20 కోట్లు ఎక్కువగా 'ఖేలో ఇండియా'కు ఈసారి రూ.900 అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌ల నిర్వహణతో పాటు అత్యుత్తమ స్థాయి శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, అక్కడ సౌకర్యాల కల్పన కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. మరోవైపు దేశవ్యాప్తంగా స్టేడియాల నిర్వహణ, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) కోసం ఖర్చు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు ప్రభుత్వం రూ.822.60 కోట్లు కేటాయించింది. దేశంలోని వివిధ క్రీడా సమాఖ్యలకు ఈ సారి రూ.340 కోట్లు అందజేస్తున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా), జాతీయ డోపింగ్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్)ల కోసం వరుసగా 21.73 కోట్లు, రూ. 22 కోట్లు చొప్పున కేటాయించారు.

అజేయంగా సెమీస్‌లోకి

- భారత మహిళల జట్టుకు 'హ్యాట్రిక్' విజయం
- రాణించిన షఫాలీ వర్మ, హేమలత, అరుంధతి


షఫాలీ

దంబుల్లా: అటు బ్యాటింగ్‌లో... ఇటు బౌలింగ్‌లో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టి20 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. నేపాల్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 82 పరుగుల తేడాతో గెలిచింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (48 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (42 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ 2 వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ 'ఎ'లోని మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో యూఏఈ జట్టును ఓడించింది. 4 పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంతో పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో బంగ్లాదేశ్; థాయ్‌లాండ్‌తో శ్రీలంక తలపడతాయి.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (స్టంప్డ్) కాజల్ శ్రేష్ట (బి) సీతా రాణా మగర్ 81; హేమలత (సి) రుబీనా ఛెత్రి (బి) సీతా రాణా మగర్ 47; సజన (ఎల్బీడబ్ల్యూ) (బి) కబితా జోషి 10; జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 28; రిచా ఘోష్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-122, 2-133, 3-156. **బౌలింగ్:** కబితా కున్వర్ 2-0-20-0, షబ్నమ్ రాయ్ 4-0-41-0, పూజా మహతో 1-0-13-0, కబితా జోషి 4-0-36-1, రుబీనా ఛెత్రి 1-0-14-0, ఇందూ బర్మ 4-0-29-0, సీతా రాణా మగర్ 4-0-25-2.

నేపాల్ ఇన్నింగ్స్: సంజానా ఖాడ్కా (బి) అరుంధతి రెడ్డి 7; సీతా రాణా మగర్ (బి) అరుంధతి రెడ్డి 18; కబితా కున్వర్ (సి) స్మృతి మంధాన (బి) రేణుక 6; ఇందూ బర్మ (సి) షఫాలీ (బి) రాధా యాదవ్ 14; రుబీనా ఛెత్రి (బి) దీప్తి శర్మ 15; పూజా మహతో (రనౌట్) 2; కబితా జోషి (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 0; బిందూ రావల్ (నాటౌట్) 17; డాలీ భట్టా (సి) రిచా ఘోష్ (బి) రాధా యాదవ్ 5; కాజల్ శ్రేష్ట (సి అండ్ బి) దీప్తి శర్మ 3; షబ్నమ్ రాయ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 96. వికెట్ల పతనం:** 1-8, 2-21, 3-43, 4-52, 5-64, 6-64, 7-70, 8-82, 9-93. **బౌలింగ్:** రేణుక సింగ్ 4-1-15-1, అరుంధతి రెడ్డి 4-0-28-2, తనూజా కన్వర్ 4-1-12-0, దీప్తి శర్మ 4-0-13-3, రాధా యాదవ్ 3-0-12-2, సజన 1-0-11-0.



ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు పారిస్‌కు చేరుకున్నారు. భారత మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా, ప్రీతి, జైస్మిన్... బ్యాడ్మింటన్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ అక్కడి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. క్రీడా గ్రామంలో టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను సాత్విక్ సాయిరాజ్, భారత టీటీ ప్లేయర్ శరత్ కమల్ జ్ఞానశేఖరన్ కలిసి అతనితో ఫొటోలు దిగారు.



వీళ్ల ఆటను చూడాల్సిందే!

పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు దిగ్గజాలు ● చరిత్ర సృష్టించేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారి ఒలింపిక్స్‌లో పోటీపడితేనే తమ జీవితాశయం నెరవేరినట్లు చాలా మంది క్రీడాకారులు భావిస్తారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కొందరు జాతీయ హీరోలుగా ఎదుగుతారు. ఒలింపిక్స్ పేరును ఎప్పుడు ప్రస్తావించినా తమ పేరును కూడా స్మరించుకునే విధంగా చరిత్రకెక్కుతారు. తమ అద్వితీయమైన ప్రదర్శనతో తమకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తారు. ఒలింపిక్స్‌లో పోటీపడటాన్ని... పతకాలను సాధించడాన్ని... ప్రపంచ రికార్డులు సృష్టించడాన్ని అలవాటుగా మార్చుకొని ఎవరికీ అందనంత ఎత్తులో నిలుస్తారు. మరో రెండు రోజుల్లో మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లోనూ పలు క్రీడాంశాల్లో దిగ్గజాలు మరోసారి తమ విన్యాసాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. అందులో కొందరి గురించి క్లుప్తంగా...

-సాక్షి క్రీడా విభాగం



మరో 2 రోజుల్లో...

సిమోన్ బైల్స్ (జిమ్నాస్టిక్స్)

మెరుపు తీగలా కదులుతూ... అలవోకగా పతకాలు గెలుస్తూ... ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో తనదైన ముద్ర వేసింది అమెరికాకు చెందిన సిమోన్ బైల్స్. 27 ఏళ్ల బైల్స్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. 4 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న బైల్స్ ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో 4 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 23 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకుంది. 'పారిస్'లో బైల్స్ మరో పతకం నెగ్గితే ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక పతకాలు నెగ్గిన అమెరికన్ జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పుతుంది. బైల్స్ ఐదు పతకాలు గెలిస్తే... ఒలింపిక్స్ చరిత్రలోనే 12 పతకాలతో అత్యధిక పతకాలు నెగ్గిన జిమ్నాస్ట్‌లలో లారిసా లాతినినా (రష్యా; 18 పతకాలు) తర్వాత రెండో స్థానానికి చేరుకుంటుంది.

ఎలూడ్ కిప్‌చోగి (అథ్లెటిక్స్)



లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా అథ్లెట్లకు తిరుగులేదు. పారిస్ ఒలింపిక్స్‌లో కెన్యాకు చెందిన 39 ఏళ్ల ఎలూడ్ కిప్‌చోగి గతంలో మారథాన్‌లో ఎవరికీ సాధ్యంకాని రికార్డును సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న కిప్‌చోగి 2004 ఏథెన్స్ గేమ్స్‌లో 5000 మీటర్లలో కాంస్యం, 2008 బీజింగ్ గేమ్స్‌లో 5000 మీటర్లలో రజతం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన కిప్‌చోగి ఆ తర్వాత మారథాన్ (42.195 కిలోమీటర్లు) వైపు మళ్లాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కిప్‌చోగి విజేతగా నిలిచి రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ క్రమంలో అబెబె బికిలా (ఇథియోపియా), వాల్డెమర్ (జర్మనీ) తర్వాత ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో రెండు స్వర్ణాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా నిలిచాడు. పారిస్‌లోనూ కిప్‌చోగి పతకం లేదా స్వర్ణం నెగ్గితే ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో అత్యధికంగా మూడు పతకాలు నెగ్గిన ఏకైక అథ్లెట్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

లెబ్రాన్ జేమ్స్ (బాస్కెట్‌బాల్)



ఒలింపిక్స్‌లో బాస్కెట్‌బాల్‌ను 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో అమెరికాయే తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 1980 మాస్కో ఒలింపిక్స్‌ను బహిష్కరించిన అమెరికా జట్టు ఇప్పటి వరకు బాస్కెట్‌బాల్‌లో 16 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన అమెరికా ఆ తర్వాత వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణాలు సాధించింది. మరో స్వర్ణమే లక్ష్యంగా అమెరికా పారిస్ గేమ్స్‌లో అడుగు పెడుతుంది. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ చరిత్రలో టాప్ స్కోరర్‌గా ఉన్న లెబ్రాన్ జేమ్స్ నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో ఆడుతున్న లెబ్రాన్ జేమ్స్ తన సహజశైలిలో ఆడితే ఈసారీ అమెరికాకు ఎదురుండదు.

మిజైన్ లోపెజ్ నునెజ్ (రెజ్లింగ్)



గ్రీకో రోమన్ స్టయిల్‌లో ఎదురులేని దిగ్గజ రెజ్లర్. క్యూబాకు చెందిన 41 ఏళ్ల నునెజ్ వరుసగా ఆరో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాడు. ఇప్పటికే వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణ పతకాలను సాధించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న నునెజ్ పురుషుల గ్రీకో రోమన్ 130 కేజీల విభాగంలో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. 2004 ఏథెన్స్‌లో 120 కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచిన నునెజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లలో 120 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించాడు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లలో 130 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలను గెల్చుకున్నాడు. పారిస్ గేమ్స్‌లోనూ నునెజ్ పతకం సాధిస్తే... ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో ఐదు స్వర్ణాలు లేదా ఐదు పతకాలు నెగ్గిన ఏకైక రెజ్లర్‌గా ఘనత వహిస్తాడు.

టెడ్డీ రైనర్ (జూడో)



పురుషుల జూడో క్రీడాంశంలో 12 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఫ్రాన్స్ దిగ్గజం టెడ్డీ రైనర్ సొంతగడ్డపై రికార్డుపై గురి పెట్టాడు. వరుసగా ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 35 ఏళ్ల టెడ్డీ రైనర్ ఒలింపిక్స్‌లో 3 స్వర్ణాలు, 2 కాంస్యాలు సాధించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న టెడ్డీ పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్‌తోపాటు హెవీ వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతాడు. ఈ రెండు విభాగాల్లోనూ టెడ్డీ స్వర్ణాలు సాధిస్తే ఫ్రాన్స్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో అత్యధికంగా ఐదు స్వర్ణాలు గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఫ్రాన్స్ ఫెన్సర్లు లూసియన్ గాడిన్, క్రిస్టియన్ డోరియోలా గతంలో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాల చొప్పున సాధించారు.

బైల్స్, లెబ్రాన్ జేమ్స్, కెప్‌చోగి, టెడ్డీ రైనర్, నునెజ్‌లే కాకుండా పోల్‌వాల్టర్ డుప్లాంటిస్ (స్వీడన్), టేబుల్ టెన్నిస్‌లో మా లాంగ్ (చైనా), స్విమ్మింగ్‌లో సెలెబ్ డ్రెసెల్ (అమెరికా), కేటీ లెడెకీ (అమెరికా) కూడా పారిస్ ఒలింపిక్స్‌లో కొత్త చరిత్రను లిఖించే దారిలో ఉన్నారు. వారందరికీ ఆల్ ద బెస్ట్!

సినిమా

రెప్పల్ డప్పల్


రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రధారులు. పనోరమా స్టూడియోస్ అండ్ టి-సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పల్...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

మళ్లీ ఎటో వెళ్లిపోయింది మనసు...

ప్రేమకథలను ఇష్టపడే వారి జాబితాలో 'ఎటో వెళ్లిపోయింది మనసు' (2012) సినిమా కూడా ఉంటుంది. నాని, సమంత లీడ్ రోల్స్‌లో నటించగా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రేష్మా, ఎస్. వెంకట్, సి. కల్యాణ్, సీవీ రావు నిర్మించిన ఈ సినిమాకు ఇళయరాజా అందించిన బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా 'ఎటో వెళ్లిపోయింది మనసు' సినిమా రీ రిలీజ్ కానుంది. లక్ష్మీ నరసింహా మూవీస్ బ్యానర్ మీద సుప్రియ, శ్రీనివాస్ ఆగస్టు 2న ఈ సినిమాను మళ్లీ విడుదల చేయనున్నారు. ''ప్రస్తుతం తెలుగులో రీ-రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఈ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు నిర్మాతలు.


సమంత
నాని

మరో ప్రేమకథ ఆరంభం

ఇప్పటివరకూ పలు ప్రేమకథా చిత్రాల్లో నటించారు నయనతార. తాజాగా సిల్వర్ స్క్రీన్‌పై మరో రొమాంటిక్ లవ్ స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారీ బ్యూటీ. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన విష్ణు ఎడవన్ ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్య వయస్కురాలైన ఓ మహిళ, ఓ కుర్రాడి మధ్య ఉన్న ప్రేమ బంధాన్ని నేటి సమాజం ఎలా చూస్తుంది? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని కోలీవుడ్ సమాచారం. మధ్యవయస్కురాలి పాత్రలో నయనతార, కుర్రాడి పాత్రలో కెవిన్ కనిపిస్తారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు విష్ణు. లలిత్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.


నయనతార

మేమే... మేమే...


సూర్య

'ఆది జ్వాల... అనంత జ్వాల... వైర జ్వాల... వీర జ్వాల.. దైవ జ్వాల... దావాగ్ని జ్వాల...' అంటూ మొదలవుతుంది 'కంగువా' సినిమాలోని ఫైర్ సాంగ్. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. మంగళవారం సూర్య బర్త్ డే సందర్భంగా 'కంగువా' సినిమాలోని 'ఫైర్ సాంగ్' లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఈ మట్టి ముట్టే ముందే ఇక్కడ పుట్టింది మేమే మేమే... అంకెలు పుట్టక ముందే లెక్కలు కనిపెట్టింది మేమే మేమే...' అనే లిరిక్స్‌తో సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌కు శ్రీమణి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, దీప్తీ సురేష్ ఆలపించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ది వన్... హీరో సూర్య, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ వీడియోలో 'ది వన్' అని ఉంది. దాంతో ఈ సినిమా టైటిల్ 'ది వన్' అనే ప్రచారం జరుగుతోంది. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రాన్ని జ్యోతిక, సూర్య, కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్నారు.

అశ్విన్ కెరీర్‌లో శివం భజే నిలిచిపోతుంది - విశ్వక్ సేన్


అనిల్ రావిపూడి, విశ్వక్ సేన్, అశ్విన్‌బాబు, తమన్

''శివం భజే' ట్రైలర్ బాగుంది. నేపథ్య సంగీతం అదిరిపోయింది. ఆగస్టు 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను. తన కెరీర్‌లో 'శివం భజే' నిలిచిపోతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శివం భజే'. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదలవుతోంది. మంగళవారం జరిగిన 'శివం భజే' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''శివం భజే' ట్రైలర్ బాగుంది. యూనిట్‌కి ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు అనిల్ రావిపూడి. ''అశ్విన్ క్రికెట్‌లో బాల్‌ను ఎలా బాదుతాడో బాక్సాఫీస్‌ను కూడా అలానే బాదాలి'' అన్నారు తమన్. ''పరమేశ్వరుడి కథతో రూపొందిన ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు అప్సర్. ''ముస్లిం అయిన అప్సర్‌గారు 'శివం భజే' లాంటి కథను ఎలా రాశారో అనుకున్నాను. ఇదంతా శివ లీల అనిపించింది'' అని అన్నారు అశ్విన్‌బాబు.

ఆ ఫైర్‌తో డైరెక్టర్ అయ్యా! - బండి సరోజ్ కుమార్



''నేను గతంలో 'నిర్బంధం, నిర్బంధం 2 , మాంగల్యం' వంటి సినిమాలు తీశాను. వాటిని కొన్ని వర్గాల ప్రేక్షకులు మాత్రమే చూశారు. కానీ 'పరాక్రమం' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు చూడొచ్చు'' అని బండి సరోజ్ కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, నాగ లక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ మూవీ ఆగస్టు 22న విడుదల కానుంది. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ- ''సంఘర్షణతో కూడుకున్న కథే 'పరాక్రమం'. నేను ఇండస్ట్రీకి రాక ముందు ఓ హాస్టల్‌లో ఉండేవాణ్ని. ఓ రోజు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తుంటే.. 'క్రికెటర్ అవుతావా? మీ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? వెనక చూసి ముందుకు వెళ్లాలి బ్రదర్' అని ఓ వ్యక్తి అన్న మాటలు నాలో కసిని నింపాయి. ఏదో ఒకరోజు అతను నన్ను తలెత్తుకుని చూడాలనుకున్నాను.. ఆ ఫైర్‌తోనే డైరెక్టర్ అయ్యాను'' అన్నారు.


బెల్లంకొండ సాయిశ్రీనివాస్

నాలుగువందల ఏళ్ల నాటి గుడి కథతో...

ఓ పురాతన గుడి ముందు తుపాకీ పట్టుకుని నిల్చున్నారు హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆ గుడి నాలుగు వందల ఏళ్ల క్రితం నాటిది. ఆ గుడికి హీరో ఎందుకు వెళ్లాలనుకుంటాడు? అనేది తెలుసుకోవడానికి కాస్త సమయం ఉంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఓ సినిమాను నిర్మిస్తున్నారు. దివంగత ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ 75వ జయంతి, హీరో శ్రీనివాస్ ఇండస్ట్రీలోకి నటుడిగా వచ్చి పదేళ్లు పూర్తి కావడం... ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని ఈ సినిమాను మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. జూలై 24న రెండో షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నాం. కమర్షియల్ అంశాలతో కూడిన శక్తివంతమైన, ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు లుధీర్'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

సరికొత్తగా కనిపిస్తాను - రక్షిత్ అట్లూరి



''పలాస 1978, నరకాసుర' చిత్రాల తర్వాత అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నానని చాలామంది అన్నారు. కానీ 'ఆపరేషన్ రావణ్, శశివదనే' సినిమాల్లో నా పాత్రలు సీరియస్‌గా ఉండవు. ఈ సినిమాల్లో సరికొత్తగా కనిపిస్తాను. 'ఆపరేషన్ రావణ్' నన్ను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసే సినిమా అవుతుంది'' అని రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ- ''యువ ప్రేక్షకులకు చేరువ అయ్యేలా థ్రిల్లర్ మూవీ నిర్మిస్తే బాగుంటుందని 'ఆపరేషన్ రావణ్'ని తీశాం. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో మా నాన్న వెంకట సత్యంగారి డైరెక్షన్ పట్ల నాతో పాటు రాధిక, చరణ్ రాజ్‌గార్లు కూడా సంతోషంగా ఫీలయ్యారు. ఈ సినిమాలో మనలోని ఆలోచనల అంతర్యుద్ధాన్ని చూపించే ప్రయత్నం చేశాం. ఇలాంటి థ్రిల్లర్ సినిమాను థియేటర్‌లో చూస్తేనే ఆ అనుభూతి కలుగుతుంది. ప్రస్తుతం 'పలాస 2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది'' అన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, మురళీ శర్మ, రమ్యకృష్ణ, బ్రహ్మానందం, ముఖేష్ ఖన్నా ఇతర కీలక పాత్రల్లో నటించారు. రామ్ భీమన దర్శకత్వంలో డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ భీమన మాట్లాడుతూ- ''దర్శకుడిగా నేను 'ఆకతాయి, హమ్ తుమ్' అనే రెండు సినిమాలు చేశాను. ఆ తర్వాత ఆరేళ్లకు నాకు 'పురుషోత్తముడు' చాన్స్ వచ్చింది. విజయం సాధించాలనే పట్టుదలతో ఈ సినిమా చేశాను'' అన్నారు. ''మంచి క్లీన్ ఎంటర్‌టైనర్ మూవీ తీశామని గర్వంగా చెప్పగలం'' అన్నారు రమేశ్ తేజావత్. ''పురుషోత్తముడు'లో మంచి పోలీసాఫీసర్ రోల్ చేశాను. ఈ సినిమా సక్సెస్ కావాలి'' అన్నారు బ్రహ్మానందం. ''ఈ సినిమాలో నటించడాన్ని ఆస్వాదించా. రాజ్ తరుణ్ ఈ ప్రెస్‌మీట్‌కు రాలేదు. త్వరలోనే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడతారు'' అన్నారు రాజా రవీంద్ర. ''నాది మహారాష్ట్ర. నన్ను తెలుగు అమ్మాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు హాసినీ సుధీర్.


హాసినీ సుధీర్